# లవ్ లీ స్టోరీస్

## అందమైన పరిచయం

### దాదా హయాత్

విద్యానగర్ లోకల్ రైల్వే స్టేషన్ సిమెంటు బెంచీ మీద ఉసూరుమంటూ కూలబడ్డాడు చక్రం. అతను సబెడిటర్‌గా పనిచేసే పత్రికాఫీసు సికింద్రాబాదులో వుంది. విద్యానగర్ నుంచి సికింద్రాబాద్ వెళ్ళే లోకల్ ట్రైనుకి సీజన్ టిక్కెట్టు తీసుకున్నాడు. బస్ పాస్ తీసుకోవడం కంటే ఇలా లోకల్ ట్రైన్‌కి సీజన్ టిక్కెట్టు తీసుకోవడం కారు చవక. అందుకే తీసుకున్నాడు. అదే ఇప్పుడతన్ని ఇబ్బందిలో పడేసింది.

ఇంతకీ అసలేం జరిగిందంటే చక్రం కొన్నాళ్ళు సెలవు పెట్టి స్వగ్రామం వెళ్ళాడు. అతను తిరిగొచ్చేసరికి లోకల్ రైల్వే టైం టేబుల్ మొత్తం మారిపోయింది. ఏళ్ళ తరబడి మార్పు లేకుండా వున్న టైం టేబుల్, ఇప్పుడు తనని చూసే మారిపోయినట్టుంది! లోకల్ ట్రైన్లు నడపడంలో నష్టాలొచ్చి కాబోలు, సగానికి సగం సర్వీసులు తగ్గించేశారు. మామూలుగా తను వెళ్ళే సమయానికొచ్చే రైలు లేదని తెలిసిపోయింది. చక్రానికి ఏడుపొచ్చినంత పనైంది.

మామూలుగానే తెల్లారే లేచి హడావుడిగా కాలకృత్యాలు పూర్తి చేసుకుని పరిగెడితే గాని టైముకి పత్రికాఫీసు చేరుకోలేడు. ఇప్పుడు తను టైముకి చేరుకోవాలంటే మామూలుగా బయల్దేరే వేళకంటే ఇంకా గంట ముందు బయల్దేరాలి. పోనీ ఈసారికి రైలుకి వెళ్ళడం మానేసి బస్సులో వెళ్తే?

చక్రానికి అలా చేయడానికే మాత్రం మనస్కరించలేదు. అతని దంతా బడుగు జీవితం. ఏదో నాలుగు ముక్కలు చక్కగా తెలుగు భాష రాయడానికి అలవాటు పడ్డవాడు కాబట్టే పత్రికాఫీసులో అతనికి సబెడిటర్ పోస్టు దొరికింది. లేకపోతే తను చదివిన బియ్యే చదువుకు నిరుద్యోగిగానే మిగిలిపోయేవాడు. సబెడిటర్‌గా తనకొచ్చే జీతంలో అతికష్టం మీద ఊరికి మూడొందలు పంపగలుగుతున్నాడు. ఇక మిగిలిన జీతంలో కాఫీలకనీ టిఫిన్లకనీ భోజనాలకనీ పావలా అర్ధరూపాయిల్తో సహా లెక్కలు వేసి పెట్టుకుంటే గానీ నెలగడవదు. అలాంటిది ఇప్పుడు రూపాయిన్నర పెట్టి బస్సులో వెళ్ళాలంటే తన బడ్జెట్‌లో కోత పెట్టక తప్పదు. అసలు రైలుకి సీజన్ టిక్కెట్టుండగా బస్సులో ఎందుకు వెళ్ళాలి? పైగా భయంకరమైన రద్దీ అదీను. కనుక రూపాయిన్నర పెట్టి బస్సులో వెళ్ళేకంటే రైల్లో ఓ గంట ఆలస్యంగా వెళ్ళి ఎడిటరుగారి చేత చీవాట్లు పెట్టించుకోవడమే సుఖమనే నిర్ణయానికి వచ్చాడు.

ఆవేళప్పుడు రావాల్సిన లోకల్ ట్రైనేదీ లేకపోవడం వల్ల స్టేషన్‌లో బొత్తిగా జనసంచారం లేదు. కొద్ది రోజుల క్రితం మాటైతే ఇదే వేళకు స్టేషన్ నిండా జనం వుండేవారు! అలాంటిది ప్రస్తుతం జనం లేక బోసిపోయినట్లుగా వున్న ప్లాట్ ఫాం చూస్తుంటే అతనికెలాగో వుంది. ఆ స్టేషన్లో లోకల్ ట్రైన్లు తప్ప మరింకేం రైలూ ఆగదు. అందుకే అంత నిర్మానుష్యంగా కనిపిస్తోంది.

ఇంకా గంటసేపు ఆ సిమెంటు బెంచీ మీదే గడపాలంటే అతనికి కష్టమనిపించింది. విసుగ్గా లేచి ప్లాట్‌ఫాం మీద పచార్లు ప్రారంభించాడు. అది కూడా బోరు కొట్టి ప్లాట్‌ఫాం మీద ఓ చివరగా వెళ్ళి నిలబడ్డాడు. అతను నిలబడ్డ చోటు దుర్గాబాయి దేశ్‌ముఖ్ హాస్పిటల్ వెనక వైపు వుంది. హాస్పిటల్ స్థలానికి రైల్వే ప్లాట్ ఫాం కూ మధ్య ఇరవై అడుగుల వెడల్పుకు కొంచెం అటూ ఇటూగా ఒక పల్లం బయల్దేరుతుంది. ఆ పల్లానికి అటూ ఇటూ దుబ్బుగా పిచ్చి మొక్కలు ముళ్ళకంపలూ కొన్ని చోట్ల ఆరేడు అడుగుల ఎత్తు వరకూ పెరిగాయి. ఆ దుబ్బుకు నడిమధ్య సన్నని కాలిబాట ఒకటి హాస్పిటల్ ప్రాంతం దాటి శంకరమఠం వైపుగా వెళ్తుంది. విద్యానగర్ స్టేషన్‌నుంచి శంకరమఠం వైపుకు అడ్డదారిన వెళ్ళి పోదల్చుకున్నావారికి ఆ కాలిబాట చక్కగా ఉపయోగపడుతుంది. ఆ బాట గురించి తెలిసినవాళ్ళు చాలా తక్కువ కాబట్టి జనసంచారం కూడా అక్కడ చాలా తక్కువ. చక్రం నిలబడ్డ చోటునుండి ఆ కాలిబాట జనం రాక కోసం ఒంటరిగా ఎదురు చూస్తున్నట్టు కనిపించింది.

అతను నిలబడ్డం చోటు నుంచి ఇంకా అవతలికి చూపు సారిస్తే రైలు పట్టాల మీద నడుచుకుంటూ వెళ్ళిపోవచ్చుననిపించేంత దగ్గర్లోనే కాచిగూడ రైల్వేస్టేషన్ కనిపిస్తుంది. విద్యానగర్ నుంచి కాచిగూడాకు లోకల్ రైల్లో మూడు నాలుగు నిమిషాలు ప్రయాణం. కాచిగూడ పెద్ద స్టేషన్ కాబట్టే అక్కడ రైలు పట్టాలు కూడికలూ గుణింతాలూ వేసుకుని సంఖ్యలో పెరిగిపోయినట్టు అనిపిస్తుంది. ఒకవైపు రైలు పట్టాల మీదచైనా జానపద కథల్లో కనిపించే డ్రాగన్ మూతి చాపి సౌకర్యంగా పడుకున్నట్టు ఒక రైలు బండి కనిపిస్తోంది. చక్రం ఉదయం పూట లోకల్ ట్రైను కోసం వచ్చిన ప్రతిసారీ ప్రతిరోజూ ఆ రైలు అదే పొజిషన్‌లో అవే రైలు పట్టాల మీద అక్కడే కనిపిస్తుంది. ఆ స్టేషన్ తనని చెరబట్టినట్టూ, ఎవరో రాకుమారుడు ఎప్పుడో తనని విడిపించుకుపోవడానికి రాబోతున్నట్టూ, అందాకా ఎలాగూ తను చేసే పనేం లేదు కాబట్టే అలా రైలు పట్టాల మీద పడి నిద్దరోతున్నట్టూ వుంటుంది దాని వాలకం. తదేకంగా అలా నిలబడి చూస్తుంటే రకరకాల భ్రాంతులు కలిగిస్తుంది. ఒక్కోసారి ఈ స్టేషనువైపు అది నెమ్మదిగా పాక్కుంటూ వస్తున్నట్టూ, ఒక్కోసారి ఈ స్టేషన్ కదిలి అమాంతం దాని వైపు సాగుతున్నట్టు చిత్ర విచిత్రమైన భావాలు కలిగేలా చేస్తుంది. చక్రం ఆ రైలేమిటో తెలుసుకోవడానికి ఎప్పుడూ ప్రయత్నం చేయలేదు. బహుశా అది కాచిగూడా నుంచి సాయంకాలం పూట ఎక్కడికో బయల్దేరే ఎక్స్‌ప్రెస్ బండి కావచ్చు.

కాచిగూడ స్టేషన్‌నుంచి ఇంకా అవతలికి చూపు సారిస్తే సుదూరంగా రెండు కొమ్ములతో గంభీరంగా సాక్షాత్కరించే కట్టడం ఒకటి కనిపిస్తుంది. చక్రం మొదట్లో ఆకట్టడం ఏదో పాతకాలం నాటి మసీదు అనుకునేవాడు. హైదరాబాదు నగరంలో మసీదులకు కొదవలేదు. అయితే రాను రాను అతనికి రోజూ తాను చూసేది చార్మినార్ కాదుగదా అనే సందేహం తలెత్తింది. వెంటనే అడ్డెడ్డే అనుకుంటూ నాలుక కొరుక్కోవలసిన పరిస్థితి ఏర్పడింది. చార్మినార్ కాదు గదా ఏమిటీ, సాక్షాత్తూ అది చార్మినారే. హైదరాబాద్‌లో అంత దూరం నుంచి అంత స్పష్టంగా కనిపించే పురాతన కట్టడం మరొకటి లేదు. ఆ కొమ్ముల్లా కనిపిస్తున్నవి దాని మినార్లు. మిగతా రెండు మినార్లూ అవతలివైపు దాగిపోయి వుండాలి. లేదా వాతావరణం ప్రభావం వల్ల దృష్టి దోషం ఏర్పడి రెండేసి మినార్లు ఒక్కటిగా కనబడుతూ వుండాలి. ఇంకా ఎంతకాలం అక్కడ్నించి చార్మినార్ స్పష్టంగా కనిపిస్తూ వుంటుందో తెలీదు చక్రానికి. హైదరాబాదు అడ్డ దిడ్డంగానే కాదు, నిలువుగా ఆకాశం వైపు కూడా పెరిగిపోతున్న

నగరం. ఎత్తయిన మోడరన్ బిల్డింగులు వచ్చేస్తే చార్మినార్ అక్కడ్నించి మరి కనబడకుండా దాగిపోవచ్చు.

చక్రం అలా ఫ్లాట్ ఫాం చివర నిలబడి నిలబడి కాసేపు కాచిగూడ స్టేషన్ వైపు చూశాడు. కాసేపు రైలు పట్టాల వైపు చూశాడు.కాసేపు కాచిగూడ స్టేషన్లో బద్ధకంగా పడుకున్న డ్రాగన్ లాంటి ఆ రైలుబండిని చూశాడు. కాసేపు చార్మినార్ చూశాడు. కాసేపు నిర్మలంగా వున్న ఆకాశాన్ని చూశాడు. ఆ తర్వాత ఇంకేం చూడాలో తోచక పరధ్యానంగా ఫ్లాట్ ఫాం పక్కన పల్లంలోకి దిగిపోయి హాస్పిటల్ వెనక కాలిబాటలోకి వెళ్ళి నిలబడ్డాడు.

ఆ వెంటనే అతనికి మరో ప్రపంచంలోకి వచ్చేసిన అనుభూతి కలిగింది. అటూ ఇటూ ఎత్తుగా పెరిగిన ఆ దుబ్బు అతనికి తానున్నది హైదరాబాదులో కాదు, ఏదో చిట్టడివిలో అనే భ్రాంతి కలిగించింది. స్త్రీయరిస్టు కలల్లో అప్పుడప్పుడూ జరిగినట్టు ఇంటి వెనక సందులోకి నాలుగడుగులు వేస్తే సినిమాల్లో కనిపించే మైసూరు బృందావన్ గార్డెన్స్ షార్టు కట్ లో వచ్చేసినట్టు తనుకూడా స్టేషన్ పక్క కాలిబాటలోకి దిగగానే ఏ తలకోన అడవుల్లోకో వచ్చేశాడా అనిపించింది.

చెట్ల మధ్యన నిలబడితే గాలితో పాటు వచ్చి పలకరించే ఆహ్లాదకరమైన పరిమళం అతని నాసికారంధ్రాలకు సోకి కాసేపుతన్మయత్వం కలిగించింది. క్షణక్షణం కాంక్రీటు జంగిల్లా నలువైపులకూ పాకిపోతున్న పట్టణ నాగరికత ఇలాంటి పిచ్చి మొక్కల్ని కూడా నిర్దాక్షిణ్యంగా నలిపి అవతల పారేస్తుంటే గాలిలో ఈ వింత పరిమళం ఇంకెన్నాళ్ళుంటుంది?

ఆ దుబ్బులో పూచిన ఒక రకమైన పూలు చక్రం దృష్టిని ఆకర్షించాయి. ఆ పూలమొక్కలు హైదరాబాదులో ఎక్కడ పడితే అక్కడ కనిపిస్తాయి. హైదరాబాదులో తప్ప అలాంటి పూలు చక్రం మరెక్కడా చూడలేదు. కొన్ని చిన్నచిన్న పూలు ఒకచోట చేరి వర్తులాకారంలో ఒకే పువ్వుగా ఏర్పడినట్టనిపించే చిత్రమైన పూలు. ఒక్కో పువ్వు అర్ధరూపాయి బిళ్ళకంటే కొంచెం పెద్దదిగా వుంటుంది. ఒక్కో పువ్వులో అద్భుతమైన ఒక వర్ణప్రపంచమే కనిపిస్తుంది. ముఖ్యంగా ఎరుపు పసుపు ఆరెంజి రంగుల మిశ్రమంలో మనోహరంగా కనిపించే ప్రపంచం. చిత్రమేమిటంటే ఒకే చెట్టుకు పూచే పూలలోనే ఏ ఒక్క పువ్వూ మరో దానిలా వుండక పోవడం. దేని సొగసు దానిదే. ఒక పువ్వులో పసుపులో ఎరుపు రంగు ప్రస్ఫుటంగా కనిపిస్తే మరో పుష్పంలో అదే ఎరుపు రంగు సన్నని చారికలా మాత్రమే కనిపిస్తుంది. ఒకే పువ్వులోపలి చిన్న పూలలో కూడా మళ్ళీ అదే వైవిధ్యం. ఇవన్నీ కలిపి అదొక అపురూపమైన పువ్వు అనే భావం కలిగిస్తుంది.

చక్రం ఒకసారి హైదరాబాదులో ఎక్కడ పడితే అక్కడ కనిపించే ఆ పువ్వులేమిటని ఒక మిత్రుడ్ని అడిగాడు. ఆ మిత్రుడు పాపం బొత్తిగా అరసికుడు. అన్నీ రంగుల్లో అద్భుతంగా పూచిన ఆ పూలమొక్కల కేసి నిర్లిప్తంగా చూసి, "ఏవో పిచ్చి మొక్కలు", అని మాత్రం అని వూరుకున్నాడు. హైదరాబాదులో ముళ్ళకంపలకంటే ఎక్కువగా అలాంటి మొక్కలే పెరుగుతాయి. అవి పిచ్చి మొక్కలే అయితే అంత అందమైన పిచ్చి మొక్కలు పెరిగే ఈ హైదరాబాదు నేల నిజంగా ధన్యం.

చక్రం అతి సున్నితంగా ఆ పువ్వు నొకదాన్ని తుంచి అందులోని వర్ణ విన్యాసాలు పరిశీలించడంలో మునిగిపోయాడు. ఆ పరిశీలించడంలో తన చుట్టు పక్కల ఏం జరుగుతున్నదో గమనించడం కూడా మర్చిపోయాడు.


"కొంచెం జరుగుతారా?" ఎవరిదో తియ్యయని కంఠస్వరం వినిపించగానే ఉలిక్కిపడి తల పైకెత్తి చూశాడు.

ఎదురుగా ఒకమ్మాయి నిలబడి ఉంది.

ఆమె వెళ్ళేదారికి తను అడ్డుగా నిలబడి వున్నాడని కొద్ది క్షణాల తర్వాత గానీ అతని మెదడుకు తట్టలేదు. తట్టిన వెంటనే "సారీ" చెప్పేస్తూ ఓ పక్కగా ఒదిగి నిలబడ్డాడు.

ఆమె వెంటనే అతన్ని దాటిపోలేదు.

"మీరు జరుగుతారేమోని అయిదు నిమిషాల నుంచీ ఇలాగే నిలబడ్డాను. మీ ధ్యాసలో మీరుంటే ఎలా? కాస్త అటూ ఇటూ కూడా గమనించండి", అంటూ నింపాదిగా అతని ముందునుంచి ఫ్లాట్ ఫాం



ఈ కథ కోసం ప్రత్యేకంగా తీయించిన ఫోటో ఇది. ఫోటోగ్రాఫర్: వై.ఎస్.ఎన్. మూర్తి.

వైపు వెళ్ళిపోయింది.

ఆమె అన్న మాటలో నిష్ఠూరం లేదు. చిరాకు లేదు. చాలా పొడిగా అనేసి వెళ్ళిపోయింది. అయినప్పటికీ చక్రం మనసులో ఒక విధమైన ఆత్మన్యూనతాభావం తలెత్తి గబగబా ఆ దుబ్బులోంచి బయటపడి ప్లాట్ ఫాం మీదికి వచ్చాడు.

ఆమె కూడా ప్లాట్ ఫాం మీదే నిలబడి వుంది.

చక్రానికి బొత్తిగా తెలియని మొహం కాదామె. సికింద్రాబాదు వైపు వెళ్తుంది. అంతకు మించి ఆమె గురించి అతనికేమీ తెలీదు.

సాదా చీర కట్టుకుని చాలా సాదా సీదాగా వుంటుంది మనిషి. కళ్ళు మిరుమిట్లు గొలిపే అందగత్తె ఎట్టి పరిస్థితుల్లోనూ కాదు. అలాగని కురూపి కూడా కాదు. సన్నగా కొంచెం పొడుగ్గా కనిపిస్తుంది. చెవులకు సాదా రింగులూ మెడలో సన్నని బంగారు గొలుసు తప్ప (ఇంతకీ అది బంగారు గొలుసేనా?) మరీ అలంకరణా వుండదు. కుడి చేతికి రిస్టువాచీ కట్టుకుంటుంది. ఎడమచేతికి నాలుగు మామూలు గాజులు వేసుకుంటుంది. నుదుట సన్నని బొట్టు పెట్టుకుంటుంది. చేతిలో ఎప్పుడూ కొన్ని పుస్తకాలూ, ఒక టిఫిన్ డబ్బా వుంటాయి.

ఆమె ధోరణి చూస్తే ఆమెకూ తనలాగే రైల్వే టైం టేబుల్ మారిపోయిన సంగతి తెలిసినట్టు లేదనిపించదతనికి. ఖాళీగా వున్న ప్లాట్‌ఫాం వైపు చిత్రంగా చూస్తూ మాటి మాటికీ ఈ చివర్నుంచి ఆ చివరి దాకా చూపులు సారిస్తోంది. సంగతేమిటో తెలుసుకోవడానికి బుకింగు ఆఫీసువైపు వెళ్ళబోతున్న దల్లా చక్రం తనవైపు రావడం గమనించి ఆగింది.

"సికింద్రాబాద్ ట్రైను అప్పుడే వచ్చి వెళ్ళిపోయిందా?" అడిగింది. ఆమె కంటే ఆమె కంఠ స్వరం అందంగా వుండడం చక్రం ఇందాకే గమనించాడు.

ఆమె అడిగిన ప్రశ్నకు అతను నవ్వాడు.

"నేనూ మొదట మీలాగే పప్పులో కాలేశాను. రైలు వచ్చి వెళ్ళడం కాదు — అసలీ టైముకి రైలే లేదు. టైం టేబుల్ మొత్తం మారిపోయింది. సగానికి సగం లోకల్ సర్వీసులు రద్దయిపోయాయి. సుమారు మరో గంటదాకా సికింద్రాబాదుకు రైల్లేదు" అన్నాడు.

ఆమె చప్పున తలపట్టుకుంది.

"అయ్యో! రైలుంటుందనుకొని వచ్చానే. టైం టేబుల్ మారిపోయిన సంగతే నాకు తెలీదు" అంది.

"అర్జంటు పనుంటే బస్సులో వెళ్ళడం మంచిది" అన్నాడు చక్రం.

"బస్సెందుకు నేను రైల్లోనే వెళ్తాను లెండి" అంటూ తిన్నగా వెళ్ళి ఓ సిమెంటు బెంచీ మీద కూర్చుండిపోయింది.

అలా ప్రారంభమైంది వాళ్ళిద్దరి మధ్యా పరిచయం. చాలా సామాన్యంగా ఏ ఇద్దరు కొత్త వ్యక్తుల మధ్య అయినా మొట్ట మొదట ఏర్పడే విధంగా ఎలాంటి

> ## నో ఫోన్ ఫ్రెండ్ షిప్!
>
> కమల్ సాధన్, పూజాభట్ ల అనుబంధం ఇంతా అంతా కాదని పరిశ్రమ అంతా వినిపిస్తున్న సంగతే! ఆవిడగారు తన షూటింగ్‌లో బిజీగా వుంటే కమల్ ఫోనులో ఆడుకొంటూ ఉంటాడట. అతని ఒక అభిమాని పేరు లిసా ఫోన్ చేసి, ఎలాగైనా అతనితో మాట్లాడాలని గొడవ చేసిందట...కమల్ కూల్ గా ఆమె ఫోన్ అందుకొని 'ఫోనులో స్నేహితులు నాకు వద్దు. నీకు నా మీద అంత అభిమానం వుంటే డైరక్టుగా కలుపు' అని చెప్పేడట. అవును మరి! నేరుగా కలిస్తేనే వాడి తెలిసేది.
>
> 

ప్రత్యేకతా లేకుండా ప్రారంభమైన పరిచయం అది. ఆమె కూడా తనని రోజూ ప్లాట్ ఫాం మీద చూస్తోంది కాబట్టే రైలు రావడం గురించి అడిగింది. ఆ తర్వాత చాలా సార్లు చక్రం తన మనసులోనే ఒక విషయం తర్కించుకున్నాడు. రైల్వే టైం టేబుల్ మారిపోకుండా వుంటే బహుశా ఎన్నటికీ ఆమె తనని పలకరించేదే కాదేమో! పనుల వత్తిడిలో హడావుడిగా పరిగెడుతూ ఈ మహానగరంలో రోజూ ఏ బస్టాపులోనో ఒకరికొకరు తారసపడుతూనే ఎలాంటి పరిచయం లేకుండా ఎవరికి వారే యమునా తీరే అన్న రీతిలో ఎవరికి వారే మిగిలిపోయే వేలాది మంది జనం లాగే తాముకూడా ఒకరికొకరు తెలియకుండా వుండిపోయే వారేమో!

ఆ మర్నాటి నుంచీ వాళ్ళిద్దరూ మారిపోయిన రైల్వే టైం టేబుల్ ప్రకారం చాలా ముందుగానే సికింద్రాబాదు వెళ్ళే లోకల్ కోసం రావడం అలవాటు చేసుకున్నారు. మునుపటిలా ఇప్పుడా రైలుకి రద్దీ వుండడం లేదు. ఆఫీసుల్లో పనిచేసేవారు సగానికి సగం తగ్గిపోయారు. ఒక్కోసారి ప్లాట్‌ఫాం మీద అయిదారుగురు వ్యక్తులకంటే ఎక్కువమంది కనిపించని పరిస్థితి ఏర్పడింది. ఎవరు వచ్చినా రాకపోయినా ఆ ఇద్దరు మాత్రం టంచనుగా ఆ రైలు కోసం వచ్చేవారు.

మొదట్లో వాళ్ళిద్దరూ ప్లాట్‌ఫాం మీద ఎదురైనప్పుడల్లా పలకరింపుగా నవ్వుకునేవారు. అప్పుడప్పుడూ ఒకటీ అరా మాట్లాడుకునే వాళ్ళు కూడా. ప్రతీసారీ తప్పనిసరిగా ఆ సంభాషణ రైలు గురించే సాగేది.

తామిద్దరి మధ్యా ఆ చిన్న పరిచయం ఎప్పుడు అభివృద్ధి చెంది స్నేహంగా పరిణమించిందో అతనికి స్పష్టంగా గుర్తులేదు. ఏ రోజు కారోజు త్వరత్వరగా అభివృద్ధి చెందిన పరిచయం కాదది. అప్పుడప్పుడు ఒకటీ అరా మాటలతో ఒకటీ అరా నవ్వుతో కొద్దికొద్దిగా పెరిగిన పరిచయం, ఒకరి పేరు ఒకరు తెలుసుకోవడానికి వాళ్ళిద్దరికీ కొన్ని నెలలు పట్టింది.

"నా పేరు చక్రధర్. వార్తావాహిని పత్రికలో సబెడిటర్‌గా పనిచేస్తున్నాను" అని చెప్పడంలోనే ఒక స్నేహం తామిద్దరి మధ్యా ఖాయపడినట్టు అనుభూతి కలిగిందతనికి.

పూర్వ కాలంలో రాజులూ చక్రవర్తులూ తమ పేరు తాము ఎదుటివారికి చెప్పుకునే వారు కారు. ఈయనగారి పేరు ఆయనగారికి తెలియజేయడానికి మధ్యవర్తి ఎవడో కావాలి. నిజంగా వాళ్ళని చూసి జాలిపడాలి. "ఒరే, బడుద్దాయ్! నీ పేరు నువ్వు చెప్పుకోవడానికి మధ్యలో ఇంకోడెందుకురా? నీకసలు ఫ్రెండ్ షిప్పు ఎలా డెవలప్ అవుతుందో తెలుసా?" అంటూ చిన్న సైజు లెక్చరివ్వాలి.

ఆమె పేరు స్వర్ణ. సికింద్రాబాదులో ఓ ఇంగ్లీషు మీడియం స్కూల్లో టీచరుగా పనిచేస్తోంది. జీతం పెద్దగా ఇవ్వరు. అందుకని బస్సు పాసు తీసుకోకుండా లోకల్ ట్రైనుకి సీజన్ టిక్కెట్టు తీసుకుంది. ఆమె సంపాదన మీద ఆధారపడి ఒక తల్లీ, ఒక తమ్ముడూ వున్నారు. తమ్ముడు ప్రైవేటుగా ఇంటర్ చదువుతూనే కిరాణా కొట్టులో గుమాస్తాగా పనిచేస్తున్నాడు. అయితే ఇల్లు గడవడానికి ఆమె సంపాదనే ప్రధానమైన ఆధారం.

ఆమె కుటుంబ పరిస్థితుల గురించి విన్నాక అతను తన స్థితి చెప్పుకొచ్చాడు. అతని తండ్రి స్కూలు టీచరుగా పనిచేసి రిటైరయ్యాడు. గంపెడు సంసా రం. ఆయనకొచ్చే పింఛను అంత పెద్ద సంసారం ఈదడానికి సరిపోదు. కొద్ది పాటు ట్యూషన్లు చెప్పు కుంటూ వుంటాడు. చక్రం ఇక్కడ సబెడిటరుగా పని చేసి సంపాయించే డబ్బులో మూడువందల రూపాయిలు వూరికి పంపుతాడు.

కాల్రక్రమేణా ఇద్దరూ ప్లాట్ ఫాం మీద కలుస్తుంటే ఒకే బెంచీమీద కూర్చుని మాట్లాడుకోవడం, ఇద్దరూ ఒకే పెట్టెలో ఒకే చోట కూర్చుని కబుర్లు చెప్పుకుంటూ సికింద్రాబాదు వరకూ ప్రయాణించడం అలవాటై పోయింది. నిజానికి తాను సికింద్రాబాదు వెళ్ళడానికి ఆ రైలు రావడం ఎంత అవసరమో స్వర్ణతో కలిసి ఆ రైల్లో ప్రయాణం చేయడం కూడా అంతే అవసరం అన్నట్టుగా తయారైంది పరిస్థితి. ఆమె ఏ రోజైనా రాకపోతే ఏదో వెలితిగా ఫీలయ్యేవాడు. ఆ రోజంతా మూడ్ సరిగ్గా వుండక ఆఫీసులో పని



1274

## పాత్రకోసం పాట్లు పడుతున్నాడట!



అమీర్ ఖాన్ తన వృత్తి విషయంలో ఎంతో శ్రమ తీసుకొంటాడన్న విషయం అందరికీ తెలుసు. యాష్ చోప్రా తాజా చిత్రంలో నటిస్తున్న అతను నెగిటివ్ కారెక్టర్‌కు సంబంధించిన వివరాలను సేకరించటంతో తిరుగుతున్నాడట. అందుకోసం భారతదేశంలో అతి గొప్ప ఇంటర్నేషనల్ క్రూక్‌గా పేరు పొందిన 'చార్లెస్ శోభరాజ్' ను కలిసేందుకు పర్మిషన్ కోసం అప్లై చేశాడట. అతనికి అనుమతి లభించకపోతే మరో గొప్ప దొంగను కలవాలనుకొంటున్నాడట. అతని తపనంతా అటువంటి దొంగల మనస్తత్వాన్ని వారి క్రిమినల్ మైండ్ ఎలా పనిచేస్తుందో తెలుసుకొని తెర మీద ప్రదర్శించాలంట!

కూడా సవ్యంగా సాగేది కాదు.

క్రమంగా రాత్రిపూట ఆమె అతని కలల్లోకి కూడా రావారంభించింది. రైల్లో తామిద్దరే ప్రయాణం చేస్తున్నట్టూ, దార్లో ఆ రైలు పట్టాలు తప్పి పడిపోయినట్టూ, తామిద్దరూ కూడబలుక్కుని రైలుపైకి లేపడానికి ప్రయత్నిస్తున్నట్టూ ఒకే కల రెండు మూడు సార్లు వచ్చిందతనికి.

ఆమె జ్ఞాపకం వస్తూనే మనసు తీయగా స్పందించడం, ఆమెను వెంటనే మళ్ళీ చూడాలనే తహతహ కలగడం, ఆ మర్నాటి వరకూ అది సాధ్యం కాదని తెలిసి మనసు ఉసూరుమనడం పరిపాటి అయిపోయింది. ఆదివారాల్లో, సెలవు రోజుల్లో ఆఫీసుకు వెళ్ళే అవసరం వుండదు కాబట్టి ఆమెను కలుసుకునే అవకాశం కూడా వుండదు. అలాంటి సమయాల్లో అతని మనోభావాలు వర్ణనాతీతంగా వుండసాగాయి. ఆమె ఇల్లెక్కడుందో కనుక్కుని వెంటనే వెళ్ళి చూడాలన్నంత ఆత్రం పుట్టుకొచ్చేది. అయితే అతనెప్పుడూ ఆమె ఇంటికి వెళ్ళలేదు. తనుండే గదెక్కడో ఆమెకూ చెప్పలేదు.

నేను నిన్ను ప్రేమిస్తున్నాను అని చెబితే ఆమె రియాక్షన్ ఎలా వుంటుంది? ఆ మాట జోక్‌గా తీసుకుని నవ్వేస్తుందా? లేక సీరియస్‌గా తీసుకుని తనతో మాట్లాడ్డం మానేస్తుందా?

తన వెర్రికానీ, ఒకరిపట్ల ఒకరికి ప్రేమ కలిగిన సంగతి నోటితోనే చెప్పనవసరం లేదు. నిజానికి నోటితో చెప్పనవసరం లేకుండానే ప్రేమ వ్యక్తమయిపోతుంది. ప్రతిచేతా ప్రతిమాటా, ప్రతి చూపూ ప్రేమనే ప్రతిబింబిస్తుంది. దానికి ఐ లవ్ యూ అని చెప్పాల్సిన అవసరం లేదు. ప్రేమ సూర్య బింబంలా స్వయం ప్రకాశకం. దానంతట అదే వ్యక్తమైపోతుంది.

కాదు కాదు— నోటితో చెప్పాలి. తను ప్రేమిస్తున్నానని చెప్పాలి.

ఇలా రెండు విధాలైన ఆలోచనలతో అతని మనసు తూగుటుయ్యాలలో ఊగిసలాడుతుంది.

రోజూ ఆమెతో ఆ మాట చెప్పాలనుకుంటాడు. తీరా వెళ్ళేసరికి చెప్పలేడు. ఇద్దరి మధ్యా రకరకాల సంభాషణలు సాగుతాయి. సినిమాల గురించీ, రాజకీయాల గురించీ, ఎన్నెన్నో మాట్లాడుకుంటారు. కానీ, ఆ మాట మాత్రం తన పెదవి మీదికి రాదు.

ఎలాగైతేనేం, ఒకరోజు ఆమెతో ఆ మాట చెప్పేయడానికి గట్టిగా తీర్మానించుకున్నాడు. ఆ రాత్రంతా మేలుకొని అసలా విషయం గురించి ఎలా ప్రస్తావించాలో రకరకాలుగా రిహార్సల్సు వేసుకున్నాడు.

ఆలోచనల్లోనే అతనికి తెల్లారింది.

గబగబా కాలకృత్యాలు తీర్చుకుని వేగంగా స్పందిస్తున్న హృదయంతో స్టేషనుకెళ్ళాడు.

ఆమె కనిపించకపోవడంతో ఒక్క క్షణం అతని గుండె దిగజారిపోయింది. అయితే రోజూ వచ్చే వేళకు చాలా ముందుగా వచ్చాడని గ్రహింపుకొచ్చాక మనసు శాంతించింది. ఆమె రాకకోసం ఎదురు చూస్తూ అసహనంగా ప్లాట్ ఫాం మీద పచార్లు ప్రారంభించాడు.

ఆమె రాదేమోనని భయపడ్డాడు.

కానీ ఆమె వచ్చింది.

"మీతో ఒక విషయం చెప్పాలి", అన్నాడు ఆమె రాగానే.

ఆమె నవ్వింది.

"నేనూ మీతో ఒక విషయం చెప్పాలి"

అతని గుండె తడబడ్డట్టనిపించింది.

"ఏమిటది?" నెమ్మదిగా అడిగాడు.

"ఈరోజు నేను మీతో కలిసి రావడం లేదు. మీకు ఆపోజిట్ డైరెక్షన్‌లో వెళ్తున్నాను"

"అంటే?"

ఆమె మౌనంగా ఓ కార్డు తీసి అతని చేతిలో పెట్టింది. ఆ కార్డు చూస్తూనే హఠాత్తుగా అతని గొంతు ఎవరో నొక్కేసినట్టనిపించింది.

"ఈ కార్డు మీకు ఇవ్వడం కోసమే ఈ రోజు ఇక్కడికి వచ్చాను. నా పెళ్ళి సంగతి ముందుగా మీకు చెప్పనందుకు సారీ. ఇక్కడ్నుంచి కాచిగూడ రైల్లో వెళ్ళి అక్కడ్నుంచి సిటీ బస్ స్టేషన్ వెళ్తున్నాను. మరో గంటలో మా ఊరెళ్ళే బస్సుంది. అమ్మా తమ్ముడూ నిన్న మధ్యాహ్నమే వెళ్ళారు. కొన్ని పనులుండి పోవడం వల్ల నేను ఈ రోజు బయల్దేరుతున్నాను. మా బాబాయ్ గురించి మీకెప్పుడూ చెప్పలేదు కదూ? ఆయనే ఈ పెళ్ళి జరిపిస్తున్నాడు. ఇక్కడ ఉద్యోగం మానేస్తున్నాను. కాబోయే మావారికి మా ఊళ్ళోనే ఓ ఇంగ్లీషు మీడియం స్కూలుంది. ఇక మీదట ఇద్దరం కలిసి ఆ స్కూలు నడుపుతామన్న మాట. మా తమ్ముడు చదువు పూర్తిచేసి తన కాళ్ళ మీద తాను నిలబడే దాకా మా అమ్మ తమ్ముడు నాతోనే వుంటారని షరతు పెట్టాను. అందుకు వాళ్ళు ఒప్పుకున్నారు. అంతా అదో హడావుడిగా జరిగిపోయింది. అందుకే మీతో ముందు చెప్పలేకపోయాను. దగ్గర్లో ముహూర్తం వుండడంవల్ల శుభలేఖలు కూడా అక్కడికక్కడే ప్రింటు చేయించి ఉన్న పళాన వచ్చేయమని మనిషితో కబురంపించారు"

ఆమె ఒక్క క్షణం ఆగింది. "మీరు నా పెళ్ళికి తప్పకుండా వస్తారు కదూ?" నెమ్మదిగా అడిగింది.

"వస్తాను" అతి కష్టం మీద గొంతు పెగుల్చుకుంటూ అన్నాడు చక్రం.

మాటల్లో వాళ్ళు సిగ్నల్ పడ్డ సంగతి గుర్తించనే లేదు. ఫలక్‌నుమా వెళ్ళే లోకల్ రైలు ఆట్టహాసంగా వచ్చి కీచుమని శబ్దం చేసుకుంటూ అవతలి ప్లాట్ ఫాం మీద ఆగింది.

రైలు వస్తూనే ఆమె వెళ్ళడానికి తొందర పడుతూ అతని వైపు చూసింది.

"వెళ్ళొస్తాను" అంటూ ముందుకు వెళ్ళబోయి ఎందుకో ఆగింది. ఆమె కళ్ళు అతని వైపు తిరిగాయి. "మన పరిచయం ఎప్పుడూ మర్చిపోలేను. గుడ్‌బై" అంటూ పట్టాల మీదికి దిగేసి అవతలి ట్రాక్ మీద నిలబడి వున్న రైలు వైపు పరిగెత్తింది.

నేను కూడా మన పరిచయం ఎప్పటికీ మర్చిపోలేను అందామనుకున్నాడతను. అయితే ఆ మాట చెప్పడానికి అతనికి అవకాశమే దొరకలేదు.

కొందరంతే!

ఎన్నో జన్మల బంధం వున్నట్టు దగ్గరవుతారు. ఆ బంధం గట్టిపడే లోపలే కళ్ళముందునుంచి కరిగి పోతారు.

ఆ పరిచయం మాత్రం మనసులో శాశ్వతంగా నిలిచిపోయింది.

◎